సాక్షి
కుమురం భీం

మంగళవారం, 30, సెప్టెంబర్, 2025



అమ్మ సన్నిధిలో భక్తజనం
మూలనక్షత్ర శుభఘడియల్లో బాసర సరస్వతీ దేవిని దర్శించుకునేందుకు నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు. 8లో▸



పంటలపై అడవిపందుల దాడులు
చేతికి వచ్చిన పంటలపై అడవి పందులు దాడులు చేస్తున్నాయి. పంటలు కాపాడుకునేందుకు రైతులు రాత్రిపగలు చేలలోనే కావలా కాస్తున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.4 /25.9

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.



కాగజ్‌నగర్ పట్టణంలో బతుకమ్మతో చిన్నారి

వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బతుకమ్మలతో మహిళలు



ఆసిఫాబాద్ పట్టణంలోని బాపూనగర్‌లో..



కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం మైదానంలో సంబురాలు



'సద్దుల' సంబురం

ఆసిఫాబాద్‌అర్బన్/కాగజ్‌నగర్‌టౌన్/రెబ్బెన: జిల్లావ్యాప్తంగా సోమవారం సద్దుల సంబురాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చిన ఆడపడుచులు ఆడిపాడారు. గౌరమ్మలకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని వివిధ కాలనీల్లో మహిళలు అర్ధరాత్రి వరకు ఆడిపాడి బతుకమ్మలను స్థానిక పెద్దవాగులో నిమజ్జనం చేశారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సంబురాలను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు. రెబ్బెన మండలం గోలేటిటౌన్‌షిప్‌లో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో పాటు ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి బతుకమ్మలు నెత్తిన ఎత్తుకుని ఉత్సాహపరిచారు.



బజార్‌వాడి హనుమాన్ ఆలయం వద్ద..



కాగజ్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గోలేటిలో బతుకమ్మ ఎత్తుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పక్కన జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

న్యూస్‌రీల్

సరస్వతీ దేవి అవతారంలో దుర్గామాత



సరస్వతీ దేవిగా దర్శనమిస్తున్న దుర్గామాత

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత సోమవారం సరస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు.

డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరణ



కలెక్టర్‌కు మొక్క ఇస్తున్న జాసిన్త్ జోల్

ఆసిఫాబాద్: జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా జాసిన్త్ జోల్ సోమవారం జిల్లా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన జాసిన్త్ జోల్ ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో సత్తా చాటి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం సాధించారు.

ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: కుమురంభీం 85వ వర్ధంతి ఆహ్వాన పత్రికలను జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి సోమవారం భీం మనువడు సోనేరావుతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబర్ 7న కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించే కుమురంభీం వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివాసీలు, జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

'బీసీ రిజర్వేషన్లపై వ్యతిరేకత సరికాదు'
ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ రిజర్వేషన్లపై వ్యతిరేకత సరికాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో కొందరు అప్పీలుకు వెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గవర్నర్ వెంటనే రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించాలని కోరారు. మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శంకర్, నాయకులు మారుతి, కిరణ్, మధు, రాజన్న, హనుమంతు, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో స్థానిక పండుగ!

- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల
- జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ..
- రెండు విడతల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్
- పల్లెల్లో మొదలైన సందడి



ఆసిఫాబాద్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఇప్పటికే అధికార యంత్రాంగం సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలతోపాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేసి జాబితా విడుదల చేయడంతో గ్రామాల్లో సందడి మొదలైంది. ఏళ్లుగా పదవులపై ఆశలు పెట్టుకున్న ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. చట్టప్రకారం రిజర్వేషన్లు కేటాయించడంతో అనేక గ్రామాల్లో మహిళా అభ్యర్థులు బరిలోకి దిగేందుకు ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉండగా, 3,53,895 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,76,606 మంది పురుషులు, 1,77,269 మంది మహిళలు. జిల్లావ్యాప్తంగా 345 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

విడతల వారీగా ఎన్నికలు

జిల్లాలో 127 ఎంపీటీసీ, 15 జెడ్పీటీసీ, 335 పంచాయతీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు అక్టోబర్ 23న తొలి విడత ఎన్నికలు, 27న రెండో విడత ఎన్నికలు నిర్వహించనున్నారు. అలాగే గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికలు అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న పోలింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ అనంతరం అదేరోజు గ్రామ పంచాయతీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు నవంబర్ 11న నిర్వహిస్తారు. జిల్లాలోని ఎనిమిది మండలాల్లోని 8 జెడ్పీటీసీ స్థానాలు, 71 ఎంపీటీసీ స్థానాలకు మొదటి విడతలో ఎన్నికలు జరగనుండగా, రెండో విడతలో ఏడు మండలాల్లోని 7 జెడ్పీటీసీలు, 56 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తారు. ఇక పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో కొనసాగుతాయి. జిల్లాలోని ఐదు మండలాల్లోని 114 గ్రామ పంచాయతీలు, 944 వార్డుల్లో మొదటి విడతలో పోలింగ్ జరుగుతుంది. రెండో విడతలో ఆరు మండలాల్లోని 113 గ్రామ పంచాయతీలు, 992 వార్డులు, మూడో విడతలో నాలుగు మండలాల్లోని 108 గ్రామ పంచాయతీలు, 938 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

రిజర్వేషన్లతో అయోమయం
స్థానిక సంస్థల రిజర్వేషన్లతో జిల్లాలో ప్రముఖ నాయకులు అయోమయంలో పడ్డారు. అనుకూలమైన స్థానాల్లో పోటీ చేయాలని ఎదురుచూస్తున్న చాలామంది అంచనాలు తారుమారయ్యాయి. ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ స్థానాన్ని గతంలో ఎస్టీ మహిళకు కేటాయించగా, తాజాగా బీసీ జనరల్‌కు కేటాయించారు. జిల్లాలోని బీసీ నాయకులకు రిజర్వేషన్లు కలిసి వచ్చినా జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లు అనుకూలించడం లేదు. ఆసిఫాబాద్ ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఎస్టీలకు రిజర్వ్ చేయడం జిల్లా కేంద్రంలోని స్థానిక నాయకులకు సమస్యగా మారింది. దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన నాయకులు ఇక్కడి నుంచి పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. ఆసిఫాబాద్ జెడ్పీటీసీ, ఎంపీపీగా ఎక్కువసార్లు గెలిచిన అరిగెల నాగేశ్వర్‌రావు, ఆయన సోదరుడు మల్లికార్జున్‌రావుకు స్థానికంగా పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. వీరు పొరుగు మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరిన కోనేరు కోనప్ప, ఆయన సోదరుడు కృష్ణారావుకు కూడా రిజర్వేషన్లు అనుకూలించడం లేదు. సిర్పూర్(యూ), లింగాపూర్ జెడ్పీటీసీ స్థానాలు జనరల్‌కు రిజర్వ్ కాగా, జైనూర్, తిర్యాణి, రెబ్బెన, కాగజ్‌నగర్, కౌటాల బీసీలకు కేటాయించారు. పెంచికల్‌పేట్, సిర్పూర్(టి) ఎస్సీ, ఆసిఫాబాద్, వాంకిడి, బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం ఎస్టీలకు కేటాయించడంతో స్థానిక నేతల అంచనాలు తప్పాయి.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్..

కీలక ఘట్టాలు	తొలి విడత	రెండో విడత
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 9	అక్టోబర్ 13
చివరి తేదీలు	అక్టోబర్ 11	అక్టోబర్ 15
పరిశీలన	అక్టోబర్ 12	అక్టోబర్ 16
ఉపసంహరణ	అక్టోబర్ 15	అక్టోబర్ 19
ఎన్నికల తేదీలు	అక్టోబర్ 23	అక్టోబర్ 27
ఓట్ల లెక్కింపు	నవంబర్ 11	నవంబర్ 11

గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్

కీలక ఘట్టాలు	తొలి విడత	రెండో విడత	మూడో విడత
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 17	అక్టోబర్ 21	అక్టోబర్ 25
చివరి తేదీలు	అక్టోబర్ 19	అక్టోబర్ 23	అక్టోబర్ 27
పరిశీలన	అక్టోబర్ 20	అక్టోబర్ 24	అక్టోబర్ 28
ఉపసంహరణ	అక్టోబర్ 23	అక్టోబర్ 27	అక్టోబర్ 31
ఎన్నికల తేదీలు	అక్టోబర్ 31	నవంబర్ 4	నవంబర్ 8

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు–2025, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ అందించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల్లో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. షెడ్యూల్ విడుదలైనందున అధికారులు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలన్నారు. హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతీ అంశంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలన్నారు. సందేహాలు, అపోహలు నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీపీవో భిక్షపతి గౌడ్, డీఎల్‌పీవో ఉమర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో అమల్లోకి ఎన్నికల కోడ్

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్‌అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ అక్టోబర్‌లో ప్రారంభమయ్యే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తూ అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలన్నారు. ఎన్నికల్లో ప్రజలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం, ఇతర సామగ్రి జిల్లాలోకి సరఫరా కాకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పెండింగ్ కేసుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. జిల్లావ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిర్మూలించాలని ఆదేశించారు. మట్కా, గంజాయి, పేకాట వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దన్నారు. సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, డీసీఆర్‌బీ డీఎస్పీ విష్ణుమూర్తి, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్ కుటుంబ సమేతంగా హాజరు కాగా, ఏఎస్పీ చిత్తరంజన్, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది ఆడిపాడారు. ఎస్పీ మాట్లాడుతూ పూలను పూజించడం తెలంగాణ ప్రజల గొప్ప సంస్కృతి అని కొనియాడారు. జిల్లా ప్రజలకు సద్దుల బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళా సిబ్బంది

రేషన్ డీలర్లకు కమీషన్ చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆరు నెలల పెండింగ్ కమీషన్ విడుదల చేయాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం రేషన్ డీలర్లు వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న చాలీచాలని కమీషన్‌తో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో డీలర్లకు ప్రతినెలా రూ.5వేల గౌరవ వేతనం చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, రెండేళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. హమాలీల చార్జీలు ప్రభుత్వమే భరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేషగిరిరావు, పురుషోత్తం, ఆత్మారావు, శంకరయ్య, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, నారాయణ, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కౌటాల(సిర్పూర్): మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలని ఖాళీ బిందెలతో మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో మహిళలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రెండు వారాలుగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదని తెలిపారు. బావుల్లోని కలుషిత నీటిని తాగి అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోయారు. అధికారులు క్లోరినేషన్ చేయడం లేదని ఆరోపించారు.

'ఆసిఫాబాద్' అభివృద్ధికి నిధులు

- రూ.15 కోట్లతో పట్టణంలో పనులు

ఆసిఫాబాద్: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి కాస్త ఊరట లభించింది. జిల్లా కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసింది. మేజర్ గ్రామ పంచాయతీగా కొనసాగిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏర్పడి ఏడాదిన్నర గడుస్తోంది. అయినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. దశాబ్దాల క్రితం నిర్మించిన కాలువల్లో పూడిక కూరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో అభివృద్ధి గాడితప్పుతోంది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పట్టణంలో కొంత మేర వసతులు మెరుగుపడే అవకాశం ఉంది.

అధ్వానంగా రహదారులు

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా పొట్టి శ్రీరాములు చౌక్ వద్ద వేసిన సీసీ రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పైకాజీ నగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. మురుగు నీరు ఇళ్ల మధ్య నిలిచి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. జిల్లా కేంద్రంలోని పిల్లల పార్కులో జిమ్ పరికరాలు చెడిపోయాయి. నిత్యం పార్కుకు వచ్చే వాకర్లకు సదుపాయాలు లేవు. వర్షాకాలం నేపథ్యంలో పిచ్చిమొక్కలు పెరిగినా తొలగించేవారు లేకుండా పోయారు. శ్మశాన వాటిక నిర్మించినా అక్కడికి చేరుకునేందుకు సరైన రహదారి లేదు.

తొమ్మిది పనులకు నిధులు

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో తొమ్మిది అభివృద్ధి పనులకు రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటిలో రూ.50 లక్షలతో పట్టణ సుందరీకరణ, వాటర్‌ఫాల్స్ థీమ్‌తో వెల్‌కం బోర్డు, రూ.25 లక్షలతో జిల్లా కేంద్రంలోని కొట్నాక భీమ్‌రావు పిల్లల పార్కు అభివృద్ధి చేస్తారు. రూ.1.50 కోట్లతో జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ కార్యాలయ భవనం నిర్మిస్తారు. రూ.55 లక్షలతో జన్కాపూర్‌లో జిల్లా స్పోర్ట్స్ స్టేడియం, ఓపెన్ జిమ్, రూ.50 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్, రూ.20 లక్షలతో షాదీఖానా అభివృద్ధి పనులు, రూ.25 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి, రూ.10.75 కోట్లతో పట్టణంలోని 20 వార్డుల్లో మురుగునీటి కాల్వలు, సీసీ రోడ్లు, కల్వర్టులు, ఇతర అభివృద్ధి పనులు చేయనున్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తిచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళికతో అభివృద్ధి
ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలో ప్రజల అవసరాల కోసం పనులు చేపడతాం. ప్రణాళిక ప్రకారం పనులు చేపడతాం.

– గజానంద్, మున్సిపల్ కమిషనర్

అమ్మ సన్నిధిలో భక్తజనం

- బాసర ఆలయంలో మూలానక్షత్ర పూజలు
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
- చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు
- గోదావరి వద్ద భారీ భద్రత ఏర్పాట్లు



దర్శనానికి బారులు తీరిన భక్తులు



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆలయ పూజారి

భైంసా/బాసర: బాసరలోని చదువుల తల్లి సరస్వతీని అత్యంత ప్రీతిపాత్రమైన మూలానక్షత్ర శుభఘడియల్లో దర్శించుకునేందుకు రాష్టం నలుమూలల నుంచి భక్తులు సోమవారం వేలసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వేకువజాము నుంచే బారులు తీరారు. దివ్యమూహూర్తాన తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది.

ప్రత్యేక అలంకరణ...

మూలానక్షత్రం పూజల కోసం బాసర ఆలయాన్ని ప్రత్యేకంగా పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణం పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక అలంకరణల మధ్య అమ్మవారిని స్మరిస్తూ భక్తులు దర్శనం చేసుకున్నారు. ప్రసాదల కౌంటర్ వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో కనిపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు కొంతమేర ఇక్కట్లకు గురయ్యారు. వ్యాసగుహ, మహంకాళి ఆలయం వద్ద భక్తుల సందడి కనిపించింది. ఆలయంలో మధుకర దీక్షలు స్వీకరించిన మాలధారులంతా స్వచ్ఛందంగా సేవలు అందించారు.

ఉప్పొంగిన గోదావరి

సోమవారం సైతం బాసర వద్ద గోదావరి నది ఉప్పొంగి ప్రవహించింది. గంగమ్మ తల్లి సూర్యేశ్వర ఆలయాన్ని తాకుతూ వరద నీరు ప్రవహించింది. నెల రోజులుగా బాసర వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. మూల నక్షత్రం రోజున పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు రక్షణగా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. ఆలయ అధికారులు, పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ భక్తులను కట్టడి చేశారు.

ఆదాయం రూ.25,65,100

బాసర: బాసర సరస్వతీ ఆలయానికి సోమవారం భారీగా ఆదాయం సమకూరింది. భక్తుల మొక్కులు, చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు ద్వారా ఆదాయం వచ్చింది. రూ.వెయ్యి అక్షరాభ్యాస పూజలు 1,065 జరిపించగా.. రూ.16,05,000, రూ.150 అక్షరాభ్యాసాలు 526 ద్వారా రూ.78,900, రూ.100 మండప ప్రవేశం 1930 ద్వారా రూ.1,93,000, రూ.50 మండప ప్రవేశం 310 ద్వారా రూ.15,500, రూ.100 అభిషేకం లడ్డు ప్రసాదం 2565 ద్వారా రూ.2,56,500, లడ్డు పులిహోర ప్రసాదాలతో రూ.4,16,200 సమకూరింది. మొత్తంగా రూ.25,65,100 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న బాలుడు

మహాగౌరి అవతారంలో...



మహాగౌరీ అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సోమవారం సరస్వతీ అమ్మవారు మహాగౌరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా మూడు గంటల పాటు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మహా మంగళహారతి ఇచ్చారు.

పలువురి దర్శనం...

సరస్వతీ అమ్మవారిని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ అభిలాష అభినవ్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌తో పాటు పలువురు దర్శించుకున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలనక్షత్రం కలిసిరావడంతో సుదూర ప్రాంతాల భక్తులు ఒకరోజు ముందుగానే వచ్చారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు

క్లుప్తంగా

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి



మణిదీప్‌ను అభినందిస్తున్న బాబురావు

కాసిపేట: మండలంలోని సోమగూడెంకు చెందిన పి.మణిదీప్ జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు డీఐఈవో అంజయ్య, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బాబురావు తెలిపారు. ఈ నెల 25, 26, 27వ తేదీల్లో జనగాంలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. మందమర్రి మోడల్ స్కూల్ సెకండియర్ విద్యార్థి మణిదీప్ అక్టోబర్ 2నుంచి 12వరకు శ్రీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని డీఐఈవో, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ, ఒలింపిక్ అసోసియేషన్ ఫుట్‌బాల్ సెక్రెటరీ పిన్నింటి రఘునాథరెడ్డి, కోచ్ బాదే శేఖర్ అభినందించారు.

‘ప్రైడ్ ఆఫ్ తెలంగాణ’కు ఎంపికైన ఆరాధ్య



అవార్డు స్వీకరిస్తున్న ఆరాధ్య

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ఆరాధ్య స్టార్ కిడ్ విభాగంలో ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారానికి ఎంపికైంది. హైదరాబాద్‌కు చెందిన రౌండ్ టేబుల్ సంస్థ చేపట్టిన ఎంపిక పోటీల్లో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అల్లాడి సురేష్–శాంతి దంపతుల కుమార్తె ఆరాధ్య లక్ష్మి అవార్డుకు ఎంపికైంది. పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా బాలలు పాల్గొనగా తుది పోటీలకు ఆరుగురు ఎంపికయ్యారు. వారిలో రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా చిన్నారి ఆరాధ్యలక్ష్మి ఎంపికైంది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంది.

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



దివ్యను సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని శ్రీశ్రీ నగర్‌కు చెందిన రాసపల్లి దివ్య ఇటీవల సింగరేణి కోల్‌మైన్స్ ఆధ్వర్యంలో భూపాలపల్లి నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. మంచిర్యాల డివిజన్ శ్రీరాంపూర్ ఏరియాలో జీఎం ఆఫీస్ పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న దివ్య 58 కిలోల విభాగంలో 250 కిలోల బరువు ఎత్తి పతకం అందుకుంది. డిసెంబర్‌లో నాగ్‌పూర్‌లో జరిగే కోలిండియా పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననుంది. దివ్యను తాజా మాజీ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, బీ స్ట్రాంగ్ జిమ్ నిర్వాహకులు గోదారి శ్రీనాథ్, జిమ్ సభ్యులు రవి, లక్ష్మీప్రసాద్ సన్మానించారు.





పవర్ ప్లాంటులో ప్రమాదం

- గేటు మీదపడి సీఐఎస్ఎఫ్ ఏఎస్సై మృతి
- మూసివేస్తుండగా ప్రమాదవశాత్తు ఊడిన వైనం



అర్జున సారధి(ఫైల్)

జైపూర్: పండుగపూట పవర్ ప్లాంటులో విషాదం నెలకొంది. రాత్రి విధులకు హాజరైన సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ గార్డుకు అదే చివరి డ్యూటీ అయింది. ఊహించని విధంగా గేటురూపంలో మృత్యువు కబళించింది. గేటు మూసి వేస్తున్న క్రమంలో ఊడిపోయి మీద పడడంతో ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కొవ్వూర్లకు చెందిన నరహరిశెట్టి అర్జున సారధి(56) జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)లో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ విభాగంలో ఏఎస్సైగా పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం రాత్రి డ్యూటీకి వచ్చిన ఆయన ఎస్టీపీపీ అడ్మిన్ భవనం ప్రధాన గేటు వద్ద రాత్రి విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో వీల్స్ గేటు మూసి వేస్తున్న క్రమంలో ఊడిపోయి ప్రమాదవశాత్తు అతడిపై పడింది. కిందనలిగిపోయిన అర్జున సారధిని తోటి సిబ్బంది గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రిలో మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ డీఐజీ, ఐపీఎస్ డాక్టర్ ఎంజీ.రాఘవేంద్రకుమార్, ఎస్టీపీపీ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంఛల్‌సర్కార్ పరిశీలించారు. మృతుడికి భార్య గంగాభవాని, కుమారుడు రాజసింహాదత్తు, కూతురు తేజసాయిశ్రీ ఉన్నారు. కేసు నమోదు దర్యాప్తున్న చేస్తున్నామని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతి



సతీష్(ఫైల్)

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఆటో డ్రైవర్ అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నస్పూర్ షిర్కే కాలనీకి చెందిన పూదరి సతీష్(40) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్య నుంచి విడాకులు కావడంతో ఒంటరిగా ఉంటున్నాడు. సతీష్ ఇంటి పొరుగు వారైన పన్యాల బంగారితో పార్కింగ్ విషయంలో గత నాలుగు నెలల క్రితం వివాదాలు తలెత్తాయి. ఈ నెల 28న సాయంత్రం మరోసారి పార్కింగ్ విషయంలో గొడవ జరిగింది. బంగారి భార్య లక్ష్మి, చిన్న కూతురు సతీష్ ఇంట్లోకి చొరబడి అతడిని కొట్టారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి సతీష్‌ను సుత్తితో కడుపులో కొట్టాడు. సోమవారం సతీష్ అక్క పోగుల స్వప్న ఇంటికి వెళ్లి చూసే సరికి గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి అక్క పోగుల స్వప్న ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాల మధ్య కుదిరిన రాజీ

బెల్లంపల్లి: హిందు ఉత్సవ సమితి, దళిత సంఘాల మధ్య ఏర్పడిన వైరుధ్యానికి తెర పడింది. దసరా వేడుకల్లో భాగంగా బెల్లంపల్లిలో రావణాసుర వధ కార్యక్రమం నిర్వహిస్తే అడ్డుకుంటామని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రకటించిన సంగతి తెలిసిందే. సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ తన క్యాంపు కార్యాలయంలో ఇరువర్గాలను ఆహ్వానించి శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న ఎమ్మెల్యే శాంతియుతంగా ఎవరి మనోభావాలకు భంగం కలగకుండా ఏటా ఆనవాయితీగా జరుగుతున్న రావణాసుర వధ కార్యక్రమాన్ని ఈసారి హిందు ఉత్సవ సమితి నిర్వాహకులు నిర్వహిస్తారని ఇందుకు సహకరించాలని సూచించారు. దీంతో వివాదం సమసిపోయినట్లు దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రకటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేష్, మనోహర్, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కుంబాల రాజేష్, చిలుక రాజనర్సు, గోమాస రాజం, శేఖర్, హిందు ఉత్సవ సమితి సభ్యులు నగేష్, బాల సంతోష్ పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

ముధోల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన కొట్ల విఠల్(65) ఓ దుకాణంలో నష్టం రావడంతో ఐదెకరాల భూమి అమ్మేశాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు గజేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

బోథ్: గంజాయి సాగు, సరఫరా చేస్తున్న వ్యక్తిని బోథ్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బోథ్ మండలంలోని దెమ్మి గ్రామానికి చెందిన సాంబ్లే ఈశ్వర్ సింగ్ గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయి, ఒక సెల్‌ఫోన్, మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర రావు తెలిపారు.

గంజాయి నిందితులకు జైలు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి వ్యాపారం చేసే నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి డాక్టర్ పి.శివరాంప్రసాద్ సోమవారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి పండరి తెలిపిన వివరాల ప్రకారం.. 2001 డిసెంబర్ 20న ఉట్నూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఐ సుబ్బారావు అనుమానాస్పదంగా కనిపించిన ఇచ్చోడ మండలం గాంధీనగర్‌కు చెందిన గుట్టేబాబు, గోదావరిఖనికి చెందిన నడిగొట్టు అరుణ్‌కుమార్‌లను తనిఖీ చేయగా 1100 గ్రాముల గంజాయి లభించింది. వీరిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి 10 మంది సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ సంజయ్‌కుమార్ వైరాగ్రే నేరాన్ని రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఎస్పీఎం క్వార్టర్‌లో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం ఓల్డ్ కాలనీలో పింగలి లక్ష్మణ్‌కు చెందిన డీ– 111 క్వార్టర్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు సద్దుల బతుకమ్మ వేడుకలకు వెళ్లగా రాత్రి క్వార్టర్ వెనక నుంచి పైకెక్కి గుర్తు తెలియని వ్యక్తులు రేకులు పగలగొట్టారు. తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు తాళం తెరిచి చూడగా ఇంట్లో బట్టలు చిందరవందరగా ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. రెండు తులాల బంగారు ఆభరణాలు, డబ్బులు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు.

ముధోల్‌లో పట్టపగలే చోరీ

ముధోల్: మండల కేంద్రంలోని ఎల్లమ్మ కాలనీలో నివాసం ఉంటున్న గంగసాగర అనే మహిళ ఇంట్లో సోమవారం పట్టపగలే చోరీ జరిగినట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. సదరు మహిళ షాపింగ్ కోసం నిజామాబాద్‌కు వెళ్లింది. ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా రూ.5 లక్షల నగదుతో పాటు 5తులాల బంగారం, 15తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించింది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గోదావరి పుష్కర్ ఘాట్‌పై ఉన్న శివాలయం వద్దకు చేరిన ప్రవాహం



ఉప్పొంగిన గోదావరి

నిర్మల్ జిల్లాలోని బాసరలో గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. సోమవారం వ్యాసమహర్షి ఆలయం, రెండో ఆర్చీ గేటు, వంద గదుల భవనం వరకు వరద నీరు వచ్చి చేరింది. ఆలయం వద్ద ఉన్న దుకాణాలు, ప్రైవేటు లాడ్జీలు, సత్రాలు, పుష్కరఘాట్లు నీట మునిగాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



గంగామాత విగ్రహాన్ని తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి



పూర్తిగా నీటిలో మునిగిన హారతి ఇచ్చే ఘాట్

అలరించిన సాహితీ సమార్చన



సన్మానం పొందిన కవులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని గ్రంథాలయ వీధిలో నిర్వహించిన సాహితీ సమార్చన అందరినీ అలరించింది. శతావధాని మారెపల్లి పట్వర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితీ సమార్చనకు జిల్లా నుంచి వందలాది మంది కవులు తరలివచ్చి కవితలను వినిపించారు. అనంతరం కవులను నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కవులు జక్కెపల్లి నాగేశ్వర్‌రావు, కొమ్మెర రాంమూర్తి, మేకల రామస్వామి, దబ్బెట రాజమల్లు, బొడ్డు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, మాంసంపై మీమాంస

- పండుగ రోజు దుకాణాలు బంద్
- మందుబాబుల్లో ఆందోళన

నిర్మల్‌ఖిల్లా: దసరా పర్వదినం అంటేనే అందరికీ సంబరం. పండుగ రోజున పిండివంటలతోపాటు మాంసం, మందు వంటివి స్వీకరిస్తారు. యువకులు పండుగ రోజునే విందు కోసం ప్రణాళికలు వేసుకుంటారు. ఈసారి పండుగ అక్టోబర్ 2న వస్తోంది. మందు, మాంసం నిషేధం ఉన్న గాంధీ జయంతి రోజున పండుగ నిర్వహణ ఎలా..! అన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. సాధారణంగా జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా మద్యం, మాంసం దుకాణాలు మూసివేస్తారు. మరోవైపు పండుగ రోజున మాంసాహారులైన ప్రతీ ఇంట్లో ముక్క ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై సందిగ్ధత నెలకొంటోంది. నిర్మల్ జిల్లాలో 47 వైన్స్‌లతోపాటు పదుల సంఖ్యలో బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. 400 పైగా మాంసం విక్రయ దుకాణాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దసరా పర్వదినం గాంధీ జయంతి రోజున వస్తుండడంతో మద్యం, మాంసం దుకాణాలు మూతపడనున్నాయి.

కాంట్రాక్ట్ కార్మికులకు అందని బోనస్

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్ డబ్బులు అందలేదు. శాశ్వత, కాంట్రాక్ట్ కార్మికులకు ఈ నెల 29న లాభాల బోనస్ చెల్లించనున్నట్లు యాజమాన్యం ఇటీవల ప్రకటించింది. పర్మినెంట్ కార్మికులకు నికర లాభాల్లో 34 శాతం వాటా, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5500 బోనస్‌గా చెల్లిస్తామని పేర్కొంది. పర్మినెంట్ కార్మికుల ఖాతాలో సోమవారం డబ్బులు జమ కాగా, కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించలేదు. శ్రీరాంపూర్ ఏరియాలో సుమారు 2800 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో 300 మందికి లాభాల బోనస్ చెల్లించేలా సాయంత్రానికి అధికారులు ఫైనాన్స్ క్లియర్స్ చేశారు. వీరికి ముందుగా చెల్లిస్తారు. మిగతా వారికి మరో రెండ్రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలిసింది. కాగా, కాంట్రాక్టర్లు కాంట్రాక్ట్ కార్మికుల జాబితాను కంపెనీ అధికారులకు సమర్పించిన తర్వాత అందుకు అనుగుణంగా డబ్బులను కాంట్రాక్టర్లకు కంపెనీ చెల్లిస్తుంది. కాంట్రాక్టర్లు తిరిగి ఈ డబ్బులను కార్మికులకు చెల్లిస్తారు. కాంట్రాక్టర్ల ఖాతాలో డబ్బులు జమ కావడం వల్ల తమకు ఐటీ పడుతుందని, జీఎస్టీ ఇబ్బందులు వస్తాయంటూ రెండ్రోజులుగా అధికారుల వద్ద అభ్యంతరం వ్యక్తం చేయడం, దీనిపై అధికారులు చర్చించడం జరుగుతోంది. దీనివల్ల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ఇదిలా ఉంటే శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ పనులు చేసే సీఆర్ఆర్ సంస్థ కాంట్రాక్ట్ కార్మికులు గత మూడు నెలలుగా వేతనాల కోసం సమ్మె చేస్తున్నారు. కాంట్రాక్టర్ కూడా పనులు పూర్తిగా బంద్ చేశారు. వారు జీతాలు లేక కనీసం పండుగ పూట బోనస్ వస్తుందనుకుంటే కాంట్రాక్టర్ వైఖరితో ఇవి కూడా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరాంపూర్‌లో రెండ్రోజుల్లో కాంట్రాక్ట్ కార్మికులందరికీ బోనస్ డబ్బులు చెల్లిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఒకరు అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఒకరిని సోమవారం మావల పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి కథనం ప్రకారం.. మావల గ్రామానికి చెందిన ఏరా నడిపి గంగన్న, ఏరా లక్ష్మీలు ఆరేళ్ల కిందట వారి లావాణి భూములను అదే గ్రామానికి చెందిన ఉష్కం రఘుపతి దగ్గర తాకట్టు పెట్టి ఒక్కొక్కరూ రూ.18 లక్షలు అప్పుగా తీసుకున్నారు. తీసుకున్న అప్పు డబ్బులు ప్రస్తుతం చెల్లిస్తామని భూమిని తిరిగి అప్పగించాలని కోరగా భూమిని ఇవ్వకుండా రఘుపతి కులం పేరుతో దూషించారని బాధితులు పోలీసులకు జూన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడు రఘుపతిని సోమవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

భూమి కావలెను

భూమి కావలెను. 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సంప్ర: 9440522536, 7013226716.
[SCA25008551]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462